

స్మార్ట్ రేషన్ కార్డులతో మేలు

ప్రజాశక్తి -అనంతగిరి:స్మార్ట్ రేషన్ కార్డులను మండల కేంద్రంలో శనివారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండల సివిల్ సప్లై అధికారుల సమక్షంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు. ఎంపిపి.శెట్టి. నీలవేణి, స్దానిక సర్పంచ్ సోమ్మెల. రూతూ. లబ్ధిదారులకు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వీరభద్ర చారి, ఎంపీడీవో. ప్రభాకర్, డిటి. మాణిక్యం, నాయకులు మురళి, రంజిత్, శ్యామ్, దయానిది పాల్గొన్నారు


కార్డులు ఇస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

జిమాడుగుల: మండల కేంద్రంలో రేషన్ డిపో వద్ద నూతన రేషన్ కార్డులను శనివారం స్థానిక సర్పంచ్ రాంబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో విఆర్ఓ సింహాచలం. విఆర్ఎ సత్యనారాయణ, నాయకులు ఎం రామరాజు తదితరులు పాల్గొన్నారు

కాఫీ రైతులకు అండగా ఉంటాం

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:కాఫీ రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పూడ్చిపెట్టే ఖర్చు ఇతర ప్రయోజనాల కోసం ఎకరానికి రూ.5, వేలు అందజేయడంతో పాటు కేజి కాఫీ కి రూ.50/- నష్టపరిహారం అందజేయడం జరుగుతుందని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మంత్రి శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం చినలబుడు, పకనకుడి గ్రామాల్లో పర్యటించి కాఫీ బెర్రీ బోరర్ తోటలను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తో కలిసి సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, అరకు కాఫీ పంట అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ పొందిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ప్రస్తుతం కాఫీ తోటలకు పురుగు పట్టిందని, దాని నుండి పంటను మాములు స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సుమారు 80ఎకరాల మేరకు వ్యాపించిందని, దీనిపై కమిటీ వేయడం జరిగిందన్నారు. ఎక్కడైతే ఈ పురుగు ఉత్పన్నామౌతుందో అక్కడ మళ్ళీ వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పురుగు పట్టిన కాఫీ పంటకు రైతులు నష్టపోకూడదని కేజీకి రూ:50, ఎకరానికి రూ:20 వేలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. సుమారు లక్ష మొక్కలను కూడా రైతులకు ఉచితంగా అందించడం జరిగిందన్నారు.విత్తనాలు కూడా ఉచితంగా రైతులకు ఇస్తామని మంత్రి అన్నారు. రాబోయే మూడు సంవత్సరాలు కాఫీ పంటపై దృష్టి పెడతామన్నారు. గిరిజనులు, రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతీ విషయం రైతులతో చర్చిస్తామని, వారికి ఇచ్చే నష్టపరిహారం సరిపోకపోతే పెంచి ఇచ్చే విషయంలో ఆలోచిస్తామన్నారు. రైతుల పంట భీమాపై ముఖ్యమంత్రితో సంప్రదిస్తామన్నారు. ఎట్టిపరిస్థితులలోనూ అరకు కాఫీ బ్రాండ్ కాపాడుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పురుగు సోకిన తోటలో కాఫీ మొత్తం పంట/కాయలను వెంటనే కోయాలన్నారు సుమారు 18 కంపెనీలతో యంఓయు చేసుకోవడం శుభ పరిణామమని ఆమె తెలిపారు.జిల్లాలోని గిరిజనుల జీవన విధానం మార్చడానికి వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్, సహాయ కలెక్టర్. సాహిత్, కాఫీ బోర్డు డిడి రమేష్, డ్వామా ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, జిసిసి చైర్మన్ కిడార శ్రావణ్ కుమార్, ఏపీఎస్ ఆర్టిసి విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ సియ్యారి దొన్నుదొర, వ్యవసాయ, ఉద్యాన, కాఫీ బోర్డ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.


కాఫీ రైతులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

అరకులోయ: జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తో కలిసి శ్రీకారం చుట్టారు. అరకువేలి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, లబ్దిదారులకు ఉపయోగపడేవిధంగా కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఈ కార్డులో ఆ కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించి ఉంటాయని, రేషన్ డిపోల్లో వద్ద స్కాన్ చేసిన వెంటనే వివరాలన్నీ తెలుస్తాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంటింటికీ కార్డుల పంపిణీని ప్రారంభించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,83,907 కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వృద్దులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌర సరఫరాల శాఖలో అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. స్త్రీ శక్తి పథకం క్రింద అందరు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, కార్డులోని క్యూఆర్ కోడ్ కు స్కాన్ చేసి ఏ రోజు చౌక దుకాణం వెళ్లారు, ఏ సరుకులు తెచ్చుకున్నారు అన్న వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్డు ఒక గుర్తింపు కార్డు లాగా కూడా పనిచేస్తుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, సహాయ కలెక్టర్ సాహిత్, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన మంత్రి

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-కూనవరం: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌పై అవలంభిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరావు అన్నారు. కూనవరం జంక్షన్ వద్ద ట్రంప్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధించడం అన్యాయమన్నారు. ఈ టారిఫ్‌లతో టెక్స్‌టైల్స్, సిరామిక్స్, కెమికల్స్, కార్పెట్స్ తదితర రంగాలకు మన దేశం నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి. కొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తులు నిలిచిపోయాయి. దీని తాలూకా ప్రభావం పలువురు కార్మికుల మీద ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉంటుందన్నారు. అధికశాతం వస్త్రపరిశ్రమపై ప్రభావం ఉండబోతోందన్నారు. రాష్ట్రప్రజల ప్రయోజనాలు కాపాడాలని, సార్వభౌమాధికార పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాబుబొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, సర్పంచులు మడకం నాగమణి, బొగ్గరామారావు, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి కొండ ఈశ్వర్లు, తాళ్లూరి రామారావు, మైనారిటీ నాయకులు యూసుఫ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

తగ్గుముఖం పట్టిన గోదావరి, శబరి

ప్రజాశక్తి- విఆర్‌పురం : మండలంలోని గోదావరి, శబరి నదులు గత 20 రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్నాయి. శబరి గోదావరి శుక్రవారం సాయంత్రానికి 41.60గా ఉన్న శనివారం సాయంత్రానికి 36.30కి చేరటంతో వడ్డిగూడెం శ్రీరామ్‌గిరి రహదారులపై నుండి నీరు తొలగడంతో రాకపోకలు సాగాయి. రామవరం అడివెంకన్నగూడెం సుష్టివారిగూడెం కన్నాయిగూడెం గ్రామాలకు ఇంకా రాకపోకలు పడవల మీదే సాగుతున్నాయి. ఇంకా మూడు అడుగులు తగ్గితే తప్ప రహదారులు బయటపడవని ఒకపక్క వ్యవసాయ పనులు మొదలయ్యాయని పొలాల్లో వరద తగ్గకపోవడంతో ఈ సంవత్సరం వ్యవసాయ పనులు లేటయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


శబరి, గోదావరి సంగమం వద్ద తగ్గిన నీరు

12 నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

ప్రజాశక్తి - కొయ్యూరు: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఇన్వెంటరీ క్లర్క్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు కొయ్యూరు సిఐ బి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ నెల 12నుంచి రెండు నెలలు పాడేరులో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- చింతూరు: మండల కేంద్రంలోని ఆర్టిసి బస్టాండ్ వద్ద శనివారం పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముద్దాయి ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా, కలిమెలా బ్లాక్ బుడుగుడా గ్రామానికి చెందిన శేఖ రాంబాబుగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ లక్షా 25 వేలు ఉంటుందని తెలిపారు. ముద్దాయి నుంచి ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని రిమాండ్ నిమిత్తం రంపచోడవరం జిఎఫ్ సిఎం కోర్టుకు హాజర పరిచినట్టు సిఐ గోపాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ రమేష్. సిబ్బంది పాల్గొన్నారు.


రేషన్‌కార్డులు అందిస్తున్న తహశీల్దార్ అన్నాజీరావు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - జికె వీధి : మండల కేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద స్మార్ట్‌రేషన్ కార్డులను తహశీల్దార్ హెచ్.అన్నాజీరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు శనివారం పంపిణి చేశారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగానే స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు, జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, గొర్ల వీర వెంకట్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఎఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - దేవీపట్నం : రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల ఉన్నతస్థాయి అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆరోపించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ పరిధిలో గత సంవత్సరం కాలం నుండి పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవించాయని విద్యార్థులకు వైద్యం అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ఆరోపించారు. ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా పూర్తిస్థాయి ఉద్యోగులు లేరన్నారు. ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సమస్య పరిష్కరించకుండా తూతూ మంత్రంగా అధికారులను సస్పెండ్ చేస్తున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలపై జరిగిన ఘటనలపై సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు ఎఎన్‌ఎంలను నియమించాలని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.

8న వరద ప్రాంతాల్లో వైసిపి నాయకుల పర్యటన

ప్రజాశక్తి - విఆర్‌పురం: వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ అధ్యక్షతన శనివారం మండల కమిటి సమావేశం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన విఆర్‌పురం మండలంలో వరద బాధితులను పరామర్శించడానికి ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి చింతరేవుపల్లి, పెద్దమట్టపల్లి మీదుగా రేకపల్లి చేరుకుని అక్కడనుండి రాజుపేట, విఆర్‌పురం, వడ్డిగూడెం కాలనీ వడ్డుగూడెం, గ్రామాల్లో బాధితులను పరామర్శించి అనంతరం రేకపల్లిలో వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు ఇంటి వద్ద మూడు గంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు

'శ్యామలవెంకటరెడ్డి ఆశయాలు సాధిద్దాం'



మాట్లాడుతున్న వేకరాజకుమార్

ప్రజాశక్తి - చింతూరు: మండల కేంద్రంలోని శ్యామల వెంకటరెడ్డి భవనంలో ఆయన వర్ధంతి సందర్భంగా శ్యామల వెంకటరెడ్డి చిత్రపటానికి ఎంపిటిసి వేక రాజ్‌కుమార్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు పెద్దరాములు పూలమాలు వేసి నివాళలర్పించారు. వేక రాజ్‌కుమార్ మాట్లాడుతూ అత్యంత ధైర్య సాహసాలతో మన్యంలో ఎర్రజెండాను, పేదల ఉద్యమాన్ని సమున్నతంగా నిలబెట్టారని కొనియాడారు.
1985లో భీష్మారావు, చంద్ర రావు మృతి వల్ల ఉద్యమానికి లోటు రాకుండా పూర్తి కాలం విప్లవకారుడుగా కొనసాగారు. వ్యవసాయ కార్మికుల పోరాటాలకు కూడా తోడ్పాటు అందించారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పి.సుబ్బారావు, కారం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు

ప్రజాశక్తి-జికెవీధి : మండలంలో రింతాడ సచివాలయం 2 పరిధిలోని దుచ్చరపాలెంలో 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాజ్‌మా విత్తనాలను పారికలు, ఏబులం, కోరపల్లి, అరటి చెట్ల వీధి, పెదపాడు, జంగంపాడు, పనసలలొద్దీ తదితర గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, రింతాడ ఉపసర్పంచ్ మడపాల సోమేశ్‌కుమార్, ఎంపిటిసి ఈశ్వరమ్మ, వార్డ్ నెంబర్ సాగిన జోగిపడాల్, పీసా కమిటీ అధ్యక్షులు సాగిన భీమేశ్వర్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలు అందిస్తున్న ఎఒ తదితరులు

డొంకరాయి జలాశయం నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నీటిమట్టాలు నిలకడగా ఉండడంతో 1000 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్కో ఏడిఈ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ శుక్రవారం రాత్రి జలాశయం నీటిమట్టాలు 1035.10 అడుగులకు చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గేట్లు ద్వారా 3,000 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసామన్నారు. శనివారం 10 గంటల సమయానికి డొంకరాయి పరిసర ప్రాంతాల్లో వర్షాలు నిలిచిపోవడంతో నదీ పరిసర ప్రాంతాల్లో పిల్ల కాలువల ద్వారా వచ్చే నీరు ఇన్‌ఫ్లో తగ్గాయని దీంతో జలాశయం నీటి నిలువలు సమాంతరంగా ఉంచుతూ వెయ్యి క్యూసెక్కులు నీటిని మాత్రమే దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 1034.5 అడుగులు నీటి మట్టాలు నిలకడగా ఉందన్నారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న దశ్యం

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైర్ తగిలి రూ.లక్ష విలువచేసే రెండు పాడి గేదెలు శనివారం సాయంత్రం మృతి చెందాయి. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన బొర్రా అప్పలరాజుకు చెందిన పాడిగేదెలు మేతకు వెళ్లాయి. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న స్తంభం వైర్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయని దీంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి -సీలేరు: జికె విధి మండలం సీలేరు పురవీధుల్లో శనివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం పలు వీధుల్లో వినాయక విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం సీలేరు నదిలో నిమజ్జనం చేశారు.


నిమజ్జనానికి తీసుకెళ్తున్న గణపతి

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలోని ఒంని, జాకర వలస ప్రాథమిక పాఠశాలలను రెండవ మండల విద్యాశాఖ అధికారి జి గెన్ను శనివారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సకాలంలో విధి నిర్వహణ చేపట్టి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పిల్లలను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

మొక్కల పంపిణీపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:ముంచింగిపుట్టు మండలం దారెల గ్రామపంచాయతీ డీంగుడ గ్రామ ఆదివాసీలకు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పిడి, జాతీయ ఉపాధి పథకం అధికారులు కుమ్మక్కై, నాసిరకం మొక్కలు అందిస్తున్నారని శనివారం ఆ గ్రామ గిరిజన రైతులతో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం ఎం శ్రీను, ఆదివాసి సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా నినాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అమాయక రైతులకు ఆసరా చూసుకొని, నాసిరకమైన మూడు అంగుళాల మొక్కలు సరపర్లా చేస్తున్నారన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ పిడి, సంబంధిత అధికారులకు సమగ్ర విచారణ జరిపించి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, కాసులకు కక్కుర్తిపడి ఆదివాసి రైతులకు మోసం చేసి నాసిరకమైన మొక్కలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు వై కుమార్, రైతులు పాల్గొన్నారు .


మాట్లాడుతున్న నాయకులు, గిరిజనులు



5కె రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పాడేరులో 5కె రన్

ప్రజాశక్తి-పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శనివారం ఇంటర్నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్ లో భాగంగా జిల్లా స్థాయి మారథాన్ 5కే రెడ్ రన్ పరుగు పందాలను పాడేరులో నిర్వహించారు. జిల్లా లెప్రసి ఎయిడ్స్, టీబి అధికారి డాక్టర్. ఎం కిరణ్ కుమార్ జెండా ఊపి జిల్లా స్థాయి మారథాన్ 5కె రెడ్ రన్ పరుగు పందాలను లాంఛనంగా ప్రారంభించారు . మారథాన్ 5కే రెడ్ రన్ పరుగు పందాల విజేతలకు జిల్లా కుష్టు, ఎయిడ్స్, జిల్లా క్షయ అధికారి డాక్టర్ ఎం కిరణ్ కుమార్ నగదు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి చలపతిరావు, భరత్ నాయక్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్. రామచందర్ . క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ స్పందన, ప్రశాంతి కళాశాల క్రీడా విభాగం శిక్షకులు నాగబాబు, అప్పారావు పీడీ , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉపేంద్ర , డాక్టర్ వసంత పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి మండల పరిషత్ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవో ఎం. పోలి నాయుడు కు అనంతగిరి ఎంపీపీ, జెడ్పిటీసీ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈఓ ను ఎంపీపీ శెట్టి. నీలవేణి, జెడ్పిటిసి దిసరి .గంగరాజు, స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. 50శాతం మండల పరిషత్, 50శాతం జిల్లా పరిషత్ నిధులు కలిపి ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే ప్రభాకర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ రాజమ్మ, టైపిస్ట్ వెంకట్, కార్యాలయ సిబ్బంది సత్యారాం తదితరులు పాల్గొన్నారు.


జెడ్ సిఇఒతో మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి, జెడ్పిటిసి గంగరాజు

సత్యారావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి -హుకుంపేట:హుకుంపేట మండలం మత్స్యాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మోష్య సత్యారావు అమరావతిలో జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. మోష్య సత్యారావు హుకుంపేట మండలంలోని ఒంటిపాక గ్రామం . ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టినప్పటి నుంచి ప్రత్యేక పద్ధతులతో విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసి ఒరియా విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడేలా కృషి చేస్తున్నారన్నారు.వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయం కేటాయించి, వారిని చదువులో ముందుకు తీసుకెళ్తున్నారు. విద్యార్థులను ఏకలవ్య మోడల్ స్కూల్స్, ఏపీఆర్ స్కూల్స్, నవోదయ, ప్లాంట్ స్కూల్స్ ప్రవేశం పొందేందుకు ప్రోత్సహిస్తున్నారు.



అవార్డును అందజేస్తున్న సిఎం చంద్రబాబు



అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి పిఎస్.కుమార్

వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో ప్రజా పాలనకు టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సుమారు 700 వరకూ పౌరసేవలను సెల్ ఫోన్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి యస్. కుమార్ తెలిపారు. గుత్తులపుట్టు గ్రామంలో శనివారం మనమిత్ర అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేఖరులతో, మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు వారికి కేటాయించిన క్లస్టర్లలో ఇంటింటికి వెళ్లి, 9552300009 నంబర్ ద్వారా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అందిస్తున్న సేవలపై విస్తతంగా అవగాహన కల్పించడంతో పాటు, ప్రతీ ఇంటి నుండి కనీసం ఒక సర్వీసును రిజిస్టర్ చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఇందులో భాగంగా పింఛను కోసం దరఖాస్తు చేయడం, కరెంట్ బిల్లు చెల్లింపు, ఆస్తి పన్ను చెల్లింపు, దేవాలయలలో దర్శనం టికెట్స్,వసతి సౌకర్యాలు ,బస్ టికెట్స్ బుకింగ్, పరీక్షల హాల్ టికెట్లు, రేషన్ కార్డు తదితర సేవలతో పాటు తల్లికి వందనం పథకం స్టేటస్, రైతులకు అన్నదాత సుఖీభవ మొదలైన పథకముల స్టేటస్ తెలుసుకునే వెసలుబాటు కల్పించారని చెప్పారు. ఇక ఇంటి నుంచే అన్ని సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, కోఆర్డినేటర్ సునీల్, జూనియర్ అసిస్టెంట్ టి.సంతోష్ పాల్గొన్నారు.



సాయిరామ్‌ను సన్మానిస్తున్న పాండురంగస్వామి తదితరులు

ఎస్‌టి కమిషన్ సభ్యులు సాయిరాంకు సన్మానం

ప్రజాశక్తి-అరకులోయ: అరకు వేలిలో ఇటీవల రాష్ట్ర కూటమి ప్రభుత్వం నియమించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కిల్లో సాయిరాం ను తన స్వగృహంలో టీడీపీ డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, టీడీపీ నాయకులు దుస్సాలువ కప్పి బొకే ఇచ్చి ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గుర్తించి ఇచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు బాధ్యతను గిరిజన చట్టాలు హక్కులపై ప్రజలకు గిరిజనుల అభివృద్ధి కోసం పాటు పడాలని టీడీపీ డివిజన్ నాయకుడు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో గూడ సర్పంచ్ కంబిడి జ్ఞానప్రకాష్, వైస్ సర్పంచ్ రాంబాబు, వార్డు మెంబర్ కిల్లో రాంబాబు, టీడీపీ నాయకులు చట్టు అప్పలరాజు, కామేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శారదానదిలో దూకిన యువతి : పోలీసుల గాలింపు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువతి శనివారం స్థానిక శారదనదిలో దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు సిఐ విజయ్ కుమార్, ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లభించలేదు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఈ విషయం తెలియడంతో శారదనది వద్దకు అత్యధిక మంది చేరుకున్నారు.

అన్నదాత పోరు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో రైతులు యూరియా "ఎరువుల కొరత వల్ల గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చంనాయుడు రైతుల దుస్థితిని కనీసం పట్టించుకోలేదని పాడేరు అరుకు శాసనసభ్యులు ఎం విశ్వేశ్వర రాజు, రేగం మత్స్యలింగం విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల సమస్య లను ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు దృష్టికి తీసుకెళ్లడానికి ఆర్డీఓలకు వినతిపత్రం ఇచ్చేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు అల్లూరి జిల్లా కేంద్రంలో పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అల్లూరి జిల్లా వైసిపి అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్వర్యంలో వైసీపీ ముఖ్య నాయకులతో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విలేకరులతో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు వెన్నుపోటు పొడిచి ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో పెట్టి ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు, రైతులకు మద్దతుగా ఈ నెల 9వ తేదీన తలపెట్టిన పోరుయాత్రకు పాడేరు అరకు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీధరి మంగ్లన్న దొర, జి మాడుగుల మండల పార్టీ అధ్యక్షులు నుర్మాని మత్యకొండం నాయుడు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, సర్పంచులు వంతాల రాంబాబు, వనుగు బసవన్న దొర, సోమెలి లక్ష్మణ రావు సీనియర్ నాయకులు మోద బాబూరావు, వంతాల నరేష్, వేణు బాబు,నాయకులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పాడేరు: 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శనివారం పాడేరులో జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయం నుండి సర్వజన సాధారణ ఆసుపత్రి పాడేరు వరకు ప్రభుత్వ బహుళార్ధసాధక మహిళా ఆరోగ్య కార్యకర్త శిక్షణ కేంద్రం పాడేరులో విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా అంధత్వ నివారణ అధికారి విశ్వేశ్వర రావు నాయుడు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వ్యక్తి మరణం తర్వాత 4-6 గంటలలోపు కళ్ళు తొలగించాలని, వయస్సు, లింగ భేదం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చునన్నారు. కళ్ళద్దాలు ధరించేవారు, మధుమేహం, అధిక రక్తపోటు మొదలైన సమస్యలతో బాధపడేవారు, కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకున్నవారు కూడా కళ్ళను దానం చేయవచ్చునని తెలియజేసారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. హేమలత మాట్లాడుతూ కంటి తొలగింపుకు దాదాపు 10-15 నిమిషాలు మాత్రమే పడుతుందన్నారు. నేత్ర దానం పై ఉన్న అపోహలు తొలగించుకోవాలనీ పిలుపునిచ్చారు. అనంతరం నేత్రదానం పై జరిగి వ్యాసరచన పోటీలలో పాల్గొన్న వారికి మొదటి మరియు రెండవ మెమంటోస్ అంద జేసారు. ఈ కార్యక్రమంలో , అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి. యన్ ప్రతాప్ , సర్వజన సాధారణ ఆసుపత్రి పాడేరు నేత్ర వైద్య నిపుణులు .అనీష్ బాబు , ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, ప్రభుత్వ బహుళార్ధసాధక మహిళా ఆరోగ్య కార్యకర్త శిక్షణ కేంద్రం పాడేరు ప్రిన్సిపాల్ శాంతకుమారి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఘాట్ రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అల్లూరి జిల్లా ఏజెన్సీ అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రధాన రహదారి పలుచోట్ల మరమ్మతుకు గురైందని మండల సిపిఎం జెడ్పిటిసి నేతృత్వంలో వారం రోజుల క్రితం ఘాట్ రోడ్డు డముకు సమీపం రోడ్డు 6వ నెంబర్ మలుపు వద్ద శ్రమదానంతో పనులు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ దృష్టికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన ఏజెన్సీకి ముఖ ద్వరమైన చిలుకలగెడ్డ పంచాయతీ పరిధి వెంకయ్యపాలెం నుండి కాశీపట్నం,ం, డమ్ముకు, ములియగూడ. అనంతగిరి, బీసుపురం. మీదుగా అరకు మండలం గాలికొండ యు పాయింట్ గేటువలస. సుంకరమెట్ట, బల్లుగుడ వరకు మరమ్మతు పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇప్పటికైనా సరే కూటమి ప్రభుత్వం ప్రధాన రహదారులను పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని పలువురు కోరారు.



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

నేరాలు ఘోరాలు



జి.మాడుగులలో పట్టుబడిన నిందితులతో పోలీసులు

పలుచోట్ల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో పెదలంక గ్రామ సమీపాన శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అటుగా రెండు ద్విచక్ర వాహనదారులు వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయడంతో గోనెసంచిలో 34 కేజీల గంజాయి బయటపడింది, ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్టు తెలిపారు. వారిని పట్టుకుని విచారించగా మరో ఇద్దరు వ్యక్తులు గంజాయితో సంబంధం ఉన్నట్టు తేలిందన్నారు. పట్టుబడ్డ ముగ్గురి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సమీపంలోని కరకపుట్టు జంక్షన్ వద్ద 3.63 కిలోల గంజాయి నూనే స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశామని అనకాపల్లి ఎఇఎస్ కె.సురేష్ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. గంజాయి నూనే రవాణా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారంతో అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వి మహేష్ ఆదేశాలతో సిబ్బంది అక్కడకు వెళ్లి నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. నాలుగు ప్యాకెట్లతో ఉన్న 3.63 కిలోల గంజాయి నూనేను పట్టుకుని, జి.మాడుగుల మండలం అలగం గ్రామానికి చెందిన ఇద్దరి నిందితుల్లో చిన్నబాలన్న (41) ను అరెస్టు చేసినట్టు చెప్పారు. పరారీలో ఉన్న మరో నిందితుడు కృష్ణారావు(25)ను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఎన్ ఫోర్స్ మెంట్ టీం సిఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు గిరిబాబు, చిన్నవీర్రాజు, హెచ్ సిలు రాజు, నాయుడు, పిఇసిలు కిరణ్, సంతోష్, రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో జీపు బోల్తా

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలం లోని కుమ్మడ పంచాయితీ పరిధిలోని దిగువ కుమ్మడ గ్రామం సమీపంలోని ఘాట్ రోడ్డు వద్ద శనివారం జీపు అదుపు తప్పి బోల్తా పడి పలువురికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తము మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి తరలించారనీ స్థానికులు జి చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.... మండల కేంద్రంలో ప్రతి శనివారం వారపు సంతకు బూసి పుట్టు పంచాయతీ పలు గ్రామాల ఆదివాసి గిరిజనులు సరుకులు కొనుగోలు చేసుకుని తిరుగు వెళ్లే ప్రయాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పలువురికి తీవ్ర , స్వల్ప ఘయలు కావడంతో హుటా హుటిన ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై రామకృష్ణను ఫోన్ లో సంప్రదించి వివరణ కోరగా క్షతకాత్రులను వైద్య సేవల నిమిత్తం సిహెచ్‌సికి తరలిస్తున్నారని వైదనంతరం వివరాలు తెలుసుకుంటామని తెలిపారు.



జీపును బయటకు తీస్తున్న గిరిజనులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - గంగవరం: ఎన్నికలహామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి విమర్శించారు. వైసిపి చేపట్టిన చంద్రబాబు ష్యూరిటి మోసం గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం గంగవరంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలను మోసం చేసిందని అందుకే వారి తరపున వైసిపి పోరాటం చేస్తోందన్నారు. అలాగే ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వైసిపి జిల్లా కార్యదర్శి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, మండల యూత్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

అంబుజా ఫౌండేషన్ శిక్షణకు స్పందన

ప్రజాశక్తి - గంగవరం: అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ ప్రచార కార్యక్రమానికి గ్రామస్థాయిలో విశేష స్పందన లభించింది. కార్యక్రమం ద్వారా సిఆర్ఎం ఎస్ఎంఒ, ఆర్ఎసి వంటి ట్రేడ్లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తమ నైపుణ్యాలను ప్రజలకు ప్రదర్శించామని మొబిలైజర్ వీర నాగబాబు ఆర్ఎసి ట్రేడ్‌ట్రైనర్ భార్గవ్ అన్నారు. శిక్షణ ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు, అభ్యర్థులకు లభించే మద్దతు గురించి గ్రామస్థులకు వివరించారు. ఎంపిడిఒ లక్ష్మణ్, తహశీల్దార్ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్థులకు సమాచారం చేరవేయడంలో తాము సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే బ్యాచ్‌ల కోసం దరఖాస్తులను స్వీకరించేందుకు ఈ ప్రచారం నిర్వహించారు. మరిన్ని వివరాలకు 9494546366 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



కింద్రలో ఆదికర్మయోగి నిర్వహిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ తదితరులు

ఆదికర్మయోగి అభియాన్‌తో గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని కింద్ర పంచాయతీలో అదికర్మయోగి అభియాన్‌లో భాగంగా సర్పంచ్ భూసరి సత్యనారాయణ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వైస్‌సర్పంచ్ సూర్యారావు, వార్డు సభ్యులు బండి పార్వతి, రామాంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-ఎటపాక: కార్మిక వ్యతిరేక కేంద్ర రాష్ట్ర విధానాలపై సమర శంఖం పూరించేందుకు డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. ఎటపాకలో అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఎటపాక ప్రాజెక్ట్ మహాసభ విజయ్ కుమారి, జి సుశీల అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లపు వెంకట్ మాట్లాడుతూ దేశంలో కార్మికులకు,రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉద్యోగులకు నష్టదాయకమైన విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను ముందుకు తీసుకొచ్చి దేశాన్ని తాకట్టు పెడుతున్నారని దేశ సంపదను కొంతమందికి దోచి పెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎటపాక ప్రాజెక్ట్ మహాసభ 25 మందితో నూతన కమిటీని ఎన్నుకుంది. ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులుగా జి.సుశీల, బి.సూర్యకుమారి, కోశాధికారిగా విజయకుమారి, ఉపాధ్యక్షులుగా మనీశ్వరి, వెంకటేశ్వరమ్మ, సహాయ కార్యదర్శిగా మాధవి, ఎస్.వెంకటరమణను ఎన్నుకున్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, నిర్మల కోశాధికారి రామలక్ష్మి , సిఐటియు జిల్లా ఐవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

గంజాయి నిర్మూలనపై స్వచ్ఛంద ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండలో గంజాయి నిర్మూలనపై ప్రజలు స్వచ్ఛందంగా శనివారం చైతన్య ర్యాలీ చేపట్టారు. సీలేరు దుప్పిలివాడ గుమ్మరేవులు ఎ.ధారకొండ, గాలికొండ పంచాయతీ ఎంపిటిసి, సర్పంచులు మారుమూల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు యువత తరలివచ్చారు. 'గంజాయిని పూర్తిగా నిర్మూలిద్దాం భవిష్యత్తును కాపాడుకుందా'మని ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం మెయిన్ రోడ్డుకు చేరుకొని సమావేశం అయ్యారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్తులో గంజాయిని పూర్తిగా నిర్మూలిద్దాం భవిష్యత్తును కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. జికె వీధి సిఐ వరప్రసాద్. సీలేరు ఎస్ఐ రవీంద్ర హాజరయ్యారు. సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో గంజాయి నిర్మూలనకు సహకరించాలన్నారు.



మెయిన్ రోడ్డు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

'బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అభినందనీయమని జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అన్నారు. బ్యాంక్‌ఆఫ్‌ఇండియా స్థాపించి 120 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో మేనేజర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకి ఇస్తున్న గోల్డ్‌లోన్లు ఎంతోమందికి దోహదపడుతున్నాయని సర్పంచ్ మురళీకృష్ణ అన్నారు. బ్యాంక్ అభివృద్ధికి వినియోగదారులు సహకరించాలని బ్యాంక్ సిబ్బంది కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ చక్రి, క్యాషియర్ అప్పన్నబాబు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భూషణందేవి గ్రామస్తులు వినియోగదారులు పాల్గొన్నారు.

పలువురికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని ముంపునకు గురైన చొక్కనపల్లి (కొత్తూరు), కల్తూనూరులో ఓంకార్ చారిట్రబుల్ సంస్థ చైర్మన్ బాలస్వామి ఆధ్వర్యంలో వరద ప్రభావిత గ్రామస్తులకు వైద్యశిబిరం నిర్వహించారు. శనివారం 158 మందికి పైగా రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణి చేశారు. పాలు, బ్రెడ్ సంస్థ సభ్యులు సొసైటీ ప్రెసిడెంట్ గొంది చంద్రయ్య, ముత్యాల శ్రీను చేతుల మీదుగా గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులు క్రమం తప్పకుండా వాడితే ఈ సీజన్లో వచ్చే వ్యాధులు సోకకుండా ఉంటాయని అన్నారు. ట్రస్ట్‌చైర్మన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ రాజేష్, సొసైటీ ప్రెసిడెంట్ గొంది చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలోని సీతగుంట పంచాయతీ పరిధిలోని డిఆర్ డిపోలో శనివారం స్థానిక సర్పంచ్ పి.మాధవరావు రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. డిఆర్ డిపో పరిధిలో 825 స్మార్ట్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ బి.గంగాధరం, విఆర్ఓ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడు నారాయణరావు, చౌడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కోట సతీష్‌లకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గౌరవం దక్కింది. శుక్రవారం పాడేరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో నారాయణరావు ప్రశంసా పత్రం అందుకున్నారు. మరో కార్యక్రమంలో ఆర్జెడీ చేతుల మీదుగా కోట సతీష్ ప్రశంసా పత్రం స్వీకరించారు.



మాట్లాడుతున్న ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నారాయణరావు

'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని లంబసింగి ఎటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలకొండ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల నేడు గంజాయి ఉత్పత్తితో దేశవ్యాప్తంగా అపఖ్యాతి పొందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండి చదువులో రాణిస్తే తమ భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు. సైబర్ క్రైమ్‌పైనా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో "డ్రగ్స్ వద్దు బ్రో" ప్రతిజ్ఞ చేయించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది, ఈగల్ టీమ్, క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డోలీలో గర్భిణి తరలింపు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పొలంబంద గ్రామానికి చెందిన నిండు గర్భిణి గెమ్మెలి మంగమ్మ ప్రసవ వేదనతో బాధపడుతుండగా అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేక గ్రామస్తులు డోలిమోతతో తరలించారు. ఆశా కార్యకర్త వంతల కాంతమ్మ సహాయంతో గ్రామస్తులు మంగమ్మను డోలిలో మోసుకుంటూ రావిమానుపాకాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, వైద్యుల పర్యవేక్షణలో మంగమ్మ సురక్షితంగా ప్రసవించినట్లు సమాచారం. కిటుముల పంచాయతీ ఉప సర్పంచ్ సుర్ల నూకలమ్మ మాట్లాడుతూ పొలంబంద గ్రామానికి వెళ్లే మట్టి రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. తమ గ్రామానికి వెంటనే తారు రహదారి నిర్మాణం చేయాలని కోరారు.



డోలీలో గర్భిణిని తీసుకెళ్తున్న గ్రామస్తులు